న్యూస్‌రీల్

కుర్మకమ్మి భూసర్వే పరిశీలన



సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట, రాయదండి శివారులో పదిరోజులుగా కొనసాగుతున్న కుర్మకమ్మి భూసర్వే ప్రగతిని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూవివరాలను అసిస్టెంట్ డైరెక్టర్(సర్వే) శ్రీనివాస్ కలెక్టర్‌కు వివరించారు. పెద్దంపేట శివారులోని 193 సర్వే నంబర్లలో 1,018 ఎకరాల విస్తీర్ణంలో కుర్మకమ్మి భూములు విస్తరించి ఉన్నట్లు వివరించారు. సర్వేలో గృహ నిర్మాణాలు, బీపీఎల్ భూములు, రహదారులు, కబ్జాలో ఉన్న రైతుల వివరాలు గుర్తించినట్లు కలెక్టర్‌కు ఏడీ వివరించారు.

'భవిత' భవనం ప్రారంభం



సెంటర్ పారంభిస్తున్న డీఈవో మాధవి

పాలకుర్తి(రామగుండం): మండల కేంద్రంలో నిర్మించిన భవిత కేంద్రం భవనాన్ని డీఈవో మాధవి బుధవారం ప్రారంభించారు. వికలాంగులైన విద్యార్థులకు విద్యతోపాటు మానసిక శిక్షణ ఇచ్చేందుకు భవిత సెంటర్ అందుబాటులోకి తెచ్చారమని డీఈవో తెలిపారు. టీచర్‌తోపాటు అన్ని పరికరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లలిత, ఎంఈవో సంపత్‌రావు, సర్పంచ్ దుర్గం జగన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత సునీల్

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అన్నారు. నాయకులు తోడేటిలావణ్య, లీలావతి, రత్నమాల, లక్ష్మి, హలిమ, శారద, విజయ, సాయిశృతి, రజిత, లింగయ్య, గుర్రం సాయి, మొండయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై దృష్టి సారించండి



వీడియో కాన్ఫరెన్సులో శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: పెండింగ్ భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు, కాలువలు, రైల్వే, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే, సింగరేణికి సంబంధించి పెండింగ్ భూసేకరణను వేగవంతం చేయాలని సూచించారు. మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఆడిట్ పేరాలపై రెవెన్యూ సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో అంతర్గాం మండలం రాయదండిలో కుర్మకమ్మి భూముల సర్వే ప్రభుత్వానికి అందించే నివేదికపై సర్వేయర్లతో సమీక్షించారు.

మల్లన్నకు మొక్కులు



ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామిని బుధవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బుధవారం చేపపిల్లలను వదిలేందుకు సిద్ధమయ్యారు. అయితే, కాంట్రాక్టర్లు తీసుకొచ్చిన చేపపిల్లల పరిమాణం చిన్నగా ఉందంటూ మత్స్యకార సంఘం సభ్యులు ఆందోళనకు దిగారు. వాటిని పంపిణీ చేయకుండానే ఎమ్మెల్యే వెనుతిరిగారు.

➡ చేపల పంపిణీలో అనుభవంలేని కాంట్రాక్టర్లు.. టెండర్లు దక్కించుకుని చిన్నసైజు చేపపిల్లలు ఇచ్చారంటూ గతేడాది మధ్యలోనే లైసెన్స్ రద్దుచేశారు అధికారులు.

➡ జిల్లాలో చేపపిల్లల పంపిణీ పథకం ప్రారంభం నుంచి ఇలాంటి అక్రమాలు చోటు చేసకుంటున్నా.. అధికారుల్లో మార్పు రావడం లేదని మత్స్యకార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నబోతున్న చేప

- చిన్న పరిమాణంలో పంపిణీ
- సంఖ్యలోనూ వ్యత్యాసం
- ఆగ్రహిస్తున్న మత్స్యకారులు



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మత్స్య సహకార సంఘం సభ్యుడు శ్రీనివాస్

చేపపిల్లల జిల్లా సమాచారం

మత్స్యకార సహకార సంఘాలు	144
సభ్యుల సంఖ్య	11,366
35–40మి.మీ.సైజ్‌వి(లక్షల్లో)	96.98
80–100మి.మీ.సైజ్‌వి(లక్షల్లో)	56.80
పంపిణీ లక్ష్యం(కోట్లలో)	1.53

సాక్షి, పెద్దపల్లి: మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వందశాతం రాయితీపై చేపవిత్తనాలు(పిల్లలు) పంపిణీ చేస్తోంది. అవి ఎదిగిన తర్వాత ఆయా గ్రామాల్లోని మత్స్యకారులు పట్టుకొని మార్కెట్లో విక్రయించి ఆర్థికంగా బలపడాలనేది ప్రభుత్వ లక్ష్యం. అయితే, ఏటా చేపపిల్లల పంపిణీ ఆలస్యంగా చేస్తూ, మరోపక్క విడుదల చేసే చేపపిల్లల సైజ్‌ల మాయాజాలంతో ఆదిలోనే వీరి ఉపాధికి అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్స్ అక్రమాలతో గండి పడుతోంది. జిల్లాలో విస్తరంగా వర్షాలు కురవటంతో ఇప్పటికే చెరువుల్లో చేపపిల్లలు వదలడం పూర్తవ్వాలి. ఆలస్యంగా విడుదల చేయటంతోపాటు చిన్నసైజు చేప పిల్లలను వదలటంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీట మునుగుతున్న నిబంధనలు

- జిల్లాలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభం నుంచి అక్రమాలే చోటుచేసుకుంటున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.
- ఒక చెరువులో కాంట్రాక్టర్ చేపవిత్తనాలు వేసే సమయంలో మత్స్యశాఖ అధికారులు, సంఘం నాయకులు ఉండాలి. ఏరకం ఎన్ని వేశారో లెక్కించాలి.
- సరఫరా చేసే పరిమాణం విషయంలో పెద్దసైజు (80–100మి.మీ) కిలోచొప్పున డ్రమ్ముల్లో, చిన్నసైజు(35–40మి.మీ) పిల్లలను కవర్లలో 10వేల చొప్పున పంపిణీ చేస్తారు.
- ప్యాకెట్‌లో వెయ్యి పిల్లలు వస్తే.. లక్ష పోయాల్సిన చెరువులకు వంద ప్యాకెట్లు కేటాయిస్తారు. కిలోకు ఎన్ని పిల్లలు వస్తాయో లెక్కించిన తర్వాత డ్రమ్ములను కాంటా వేస్తారు.
- సరఫరా చేసే వాహనంలో డ్రమ్ముల్లో ఒక శాంపిల్ తెచ్చి వాటిని లెక్కించి, అన్ని ఇట్లానే ఉన్నాయని నమ్మించి వదులుతున్నారు.



- ఉదాహరణకు కిలోకు 300 పిల్లలు వచ్చాయనుకుంటే.. డ్రమ్ము 100కిలోలుంటే అందులో 30వేల చేపపిల్లలు ఉన్నట్లు నిర్ధారిస్తారు. అంతకంటే ఎక్కువగా వస్తే చేపపిల్లల సైజు తక్కువగా ఉన్నాయని అర్థం.
- కవర్లలో తెచ్చే చేపపిల్లల సంఖ్య తక్కువగా ఉంటోందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు
- రవ్వ రకం తక్కువ ధరకు దొరుకుతుండటంతో వాటినే ఎక్కువగా పంపిణీ చేస్తున్నారు
- జూలై చివరినాటికి చెరువులు, కుంటలు అలుగుపోయడంతో మత్స్యకారులు సొంత పైసలతో సరైన పరిమాణంలోని చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో పెంపకం ప్రారంభిస్తున్నారు.
- అదునుదాటినంక చిన్నసైజ్ చేపపిల్లలను వదలుతుండటంతో పెద్దచేపలకు ఇవి ఆహారంగా మారుతున్నాయి.
- కౌంటింగ్ మిషన్ లేకుండా సరాసరిగా పంపిణీ చేస్తూ లక్ష్యం చేరినట్లు కాకిలెక్కలు రాస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ఇలా చేయాలి

- చేపపిల్లలను చెరువులో వదిలే సమయంలో వీడియో రికార్డు చేయాలి
- 35–40 మి.మీ. చేపపిల్లలు వదిలే సమయంలో సొసైటీ సభ్యుల సమక్షంలో లెక్కించాలి.
- 80–100మి.మీ. చేపపిల్లలను వదిలే సమయంలో తూకం వేయాలి.
- మత్స్యసహకార సంఘాలు నాసిరకం, చేపపిల్లల కౌంటింగ్‌పై దృష్టి పెట్టేలా అవగహన కల్పించాలి.

నాసిరకం చేపపిల్లలు వద్దు

పెద్దపల్లిరూరల్: నాసిరకం, చిన్నసైజు చేపపిల్లలను ఎందుకు తెచ్చారని మత్స్యకారులు ప్రశ్నించారు. స్థానిక ఎల్లమ్మ, గుండమ్మ చెరువులో 81వేల చేపపిల్లలు వదిలేందుకు అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్ చేపపిల్లలు వదిలేందుకు సిద్ధమవగా మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. చెరువులో చేపపిల్లలను వదలొద్దని డిమాండ్ చేశారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్, జిల్లా అధికారి భాస్కర్ వారించినా వారు వినలేదు. చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న తమకు తీరని అన్యాయం చేస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్, జిల్లా డైరెక్టర్ వీరస్వామి తదితరులు ఆరోపించారు. నాయకులు కొలిపాక సంపత్, గంగుల సంతోష్, తిరుపతి, సారయ్య, లక్ష్మణ్, జెట్టి సతీశ్, శ్రీనివాస్, నక్క రమేశ్ పాల్గొన్నారు.

ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు



చెరువుల్లో చేపపిల్లలు చేరడం ఆలస్యమైతే ఆశించినస్థాయిలో పెరుగుదల ఉండదు. ఇప్పటికే ఆలస్యమైంది. అధికారులు సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా చేపపిల్లల సైజ్, సంఖ్యలో చాలా వ్యత్యాసం ఉంటోంది. ఆలస్యంగా పోయడం కంటే నగదు చెల్లించాలి.

– కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్, పెద్దపల్లి

వెనక్కి పంపిస్తున్నాం



చేపపిల్లల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. నాణ్యమైనవే పంపిణీ చేయాలి. నిబంధనల మేరకు మత్స్యకారుల సమక్షంలో నాణ్యత తనిఖీ చేసి, లెక్కించి నీటివనరుల్లో చేపపిల్లలు వదిలేలా చర్యలు తీసుకుంటాం. నాణ్యత లేనివాటిని వెనక్కి పంపిస్తున్నాం.

– భాస్కర్, మత్స్యశాఖ అధికారి

మంత్రపురిలో 'భక్తి' ఉద్యమం



1913లో పెంజేరుకట్ట ఉత్సవ కమిటీ(ఫైల్)

చరిత్ర

- మహారాష్ట్ర నుంచి మంథనికి..
- బాలగంగాధర తిలక్ స్ఫూర్తి
- 106ఏళ్లుగా వినాయక ఉత్సవాలు
- నిజాం కాలం నుంచి కొనసాగింపు



పెంజేరుకట్ట గణపతి



నడివీధిలో గణనాథుడు

మంథని: మంత్రపురిగా పేరొందిన మంథనిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ 110 ఏళ్లుగా ఏటా వేడుకలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు చాటుకున్నారు. ఉత్సవాలు అంటే.. అందమైన సెట్టింగ్‌లు, అన్నదానాలు, పెద్ద ఎత్తున నిమజ్జనం ఊరేగింపులు.. ఇలాంటివి చూస్తాం. కానీ, మనదేశ స్వాతంత్య్ర ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి గణపతి నవరాత్రి ఉత్సవాలు దోహదం చేశాయనే విషయం చాలామందికి తెలియదు. ఆ వివరాలే ఇవీ..

బాలగంగాధర తిలక్ స్ఫూర్తితో..

- బాలగంగాధరతిలక్ మహారాష్ట్రలోని ముంబయిలో వినాయక నవరాత్రి ఉత్సవాల పేరిట 1913లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు.
- ఆ ఉత్సవాల సందర్భంగా వంటలు తయారు చేసేందుకు మంథనికి చెందిన బ్రాహ్మణ సామాజికవర్గం మధ్యభారత్‌లోని నాగ్‌పూర్(ప్రస్తుత మహారాష్ట్ర)కు వెళ్లివచ్చేవారు.
- అంతేకాదు.. అక్కడి సంప్రదాయం ఇక్కడకు తీసుకొచ్చారు. ఇక్కడ కూడా అదేవిధంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.
- దైవభక్తి పేరిట మంటపాల వద్ద ప్రజలు కలసుకుని బ్రిటిష్‌తోపాటు నిజాం నిరంకుశ పాలనలకు వ్యతిరేఀంగా ఐక్యఉద్యమాలకు వ్యూహరచన చేశారు.
- నాటి స్వాతంత్య్ర సమరానికి చిహ్నంగా నిలిచిన గణపతి నవరాత్రి ఉత్సవాలను సర్వగణానన మండలి ఆధ్వర్యంలో ఒకేచోట నిర్వహించారు.

నిజాం కాలం నుంచి..

నిజాంకాలం నాటి వినాయక నవరాత్రి ఉత్సవాల సంస్కృతి, సంప్రదాయాలు కాలక్రమంలో అన్నిగ్రామాలకూ విస్తరించాయి. ఈ నేపథ్యంలోనే మంథని పెంజేరుకట్ట హనుమాన్ ఆలయంలో సిద్ధిబుద్ధి గణపతి ఉత్సవాలను 1913 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు.

- మోతారాంగారి రాజేశ్వర్‌రావు, టక్కేగారి మల్లన్న, మంథని లింగయ్య తదితరులు ఆనాడు ఉత్సవాలు నిర్వహించేవారు.
- అలాగే నడివీధిలో సర్వజన గజానన మండలి పేరిట 1918 నుంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం శతవసంత ఉత్సవాలు వైభవంగా జరుపుకున్నారు.
- రావులచెరువు కట్ట గజానన మండలి 99 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. వచ్చేఏడాది శతవసంతాల్లో అడుగుపెట్టనుంది.
- మందాటవీధిలో అరవై ఏళ్లుగా ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

నాగ్‌పూర్, మంథనిలోనే సిద్ధిబుద్ధి..

నాగ్‌పూర్, మంథని మినహా దేశంలో ఎక్కడా సిద్ధిబుద్ధి(భార్యలు) విగ్రహాలతో గణేశ్ దర్శనం లభించదు. వంటలకు వెళ్లినవారు నాగ్‌పూర్‌లో గణపతి విగ్రహాన్ని తీసుకుని రైలులో బల్లార్షా వరకు వచ్చి.. అక్కడ విగ్రహం కనిపించకుండా గుడ్డలు చుట్టి, ఎడ్లబండిలో మంథని సమీప గోదావరి తీరం వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి కాలిబాటన నిజాం పోలీసుల కంట పడకుండా మంథనికి చేరారని చెబుతున్నారు.

105 ఏళ్లుగా ఉత్సవాలు



మంథని నడివీధి సర్వజన గణానన మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను 105 ఏళ్లుగా ఏటా నిర్వహిస్తోంది. వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఐదేళ్ల క్రితం మంథనిలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకున్నాం. నిత్యం భజనలు చేస్తున్నాం. భక్తిశ్రద్ధలతో గణపతిని పూజిస్తున్నాం. పట్టణవాసుల్లో భక్తిభావం పెంపొందిస్తున్నాం.

– శశిభూషణ్ కాచే, స్థానికుడు, మంథని

శత వసంతోత్సవాలకు సిద్ధం



ఆనాటి హిందువుల ఐక్యత, నిజాం నవాబులకు వ్యతిరేకంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను వేదికగా చేసుకున్నారు. అప్పటినుంచి రావులచెరువు కట్ట అభయాంజనేయస్వామి ఆలయంలో 99ఏళ్లుగా ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది వందళ్ల పూర్తవుతాయి. ఆ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుంచే సన్నాహాలు చేస్తున్నాం.

– బొబ్బిలి శ్రీధర్, ఉత్సవ సమితి అధ్యక్షుడు, రావుల చెరువులకట్ట

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టండి

- ప్రజాఅంకిత యాత్రలో రామగుండం ఎమ్మెల్యే చందర్



ర్యాలీలో ఎమ్మెల్యే చందర్ తదితరులు

గోదావరిఖని: కాంగ్రెస్ మోసపూరిత కుట్రలను తిప్పికొట్టాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. బుధవారం 29వ డివిజన్‌లో ప్రజా అంకిత యాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్నారన్నారు. 60ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని కేవలం తొమ్మిదేళ్లలోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి బస్తీనిద్ర, ప్రజాఅంకిత యాత్ర చేపట్టామని చెప్పారు. డివిజన్‌లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు పెంట రాజేశ్, ఇంజపురి పులేందర్, కొమ్ము వేణుగోపాల్, జనగామ కవితాసరోజిని తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం

- అందరూ సహకరించాలి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్

గోదావరిఖని: గోదావరినదిలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. బుధవారం గోదావరి వంతెన ప్రాంతంలో గణేశ్ నిమజ్జనం ప్రాంతాన్ని వారు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈసారి 2,020 వినాయక విగ్రహాలు జిల్లాలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం పారిశ్రామిక ప్రాంతం, మంచిర్యాల జిల్లాలోని పలు మండలాల నుంచి గోదావరినదిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు పెద్దసంఖ్యలో వస్తుంటారన్నారు. ఈక్రమంలో ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇద్దరు డీసీపీలు, పలువురు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారివెంట మున్సిపల్ అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలపై ప్రచారం

మంథని: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను మంగళవారం రాత్రి స్థానిక బోయిన్‌పేటలో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వివరించారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, యువ వికాసం పథకాలు ప్రజలకు ఎంతో ప్రజోపకరమన్నారు. పేదలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. కాగా, మంథని సామాజిక వైద్యశాలలను మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సందర్శించారు. చికిత్స పొందుతున్న పలువురిని పలుకరించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ నుంచి మంథని లింగయ్య, స్వరూప, బీఆర్ఎస్ నుంచి మారెపెల్లి శంకర్ కాంగ్రెస్‌లో చేరారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

- అలసత్వం వహించే కాంట్రాక్టర్లకు నోటీసులు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- రామగుండం కార్పొరేషన్ అభివృద్ధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి బల్దియా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీకృత మార్కెట్, వైకుంఠధామం నిర్మాణాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేయాలని ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో అలసత్వం వహించే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు నిబంధనల మేరకు సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. అనధికారిక నిర్మాణాలపై నూతన మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొంత ఆదాయం పెంచుకునే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి ఆస్తి, నల్లా పన్నులు, వ్యాపారుల నుంచి లైసెన్స్ ఫీజు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని చెప్పారు. పచ్చదనం పెరిగే దిశగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, హరితహారం కింద నాటిన ప్రతీ మొక్క సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబేశ్వర్‌రావు, తహసీల్దార్ కుమారస్వామి, ఈఈ సుచరణ, ఆర్‌వో రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానీయొద్దు

పెద్దపల్లిరూరల్: ఎరువులకు కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలన్నారు. జిల్లాలో 62శాతం మందికి రుణమాఫీ అందిందని అన్నారు. నవంబర్ వరకు వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పెండింగ్‌లోని 10 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను వారంలోగా ప్రారంభించాలని చెప్పారు. జెడ్పీ సీఈవో శ్రీనివాస్, డీఆర్డీవో శ్రీధర్, డీఎఫ్‌వో శివయ్య, డీపీవో చంద్రమౌళి, డీఏవో ఆది రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధీశాలి.. సర్వాయి పాపన్న

- కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, ఎమ్మెల్యే దాసరి



విగ్రహం ఆవిష్కరిస్తున్న రవికుమార్

పెద్దపల్లిరూరల్: తెలంగాణలో జాగీర్దార్, మొఘల్ చక్రవర్తుల అరాచక పాలన అంతమొందించేందుకు వీరోచితంగా పోరాడిన ధీశాలి సర్వాయి పాపన్నగౌడ్ అని కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. పట్టణ శివారులోని మంథని రైల్వేవంతెన వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. నిజాం పాలనను తుదముట్టించేందుకు ఛత్రపతి శివాజీ మహారాష్ట్రలో పోరాటం సాగించిన రీతినే సర్వాయి పాపన్న తెలంగాణలో పోరు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం తెలంగాణ వీరయోధులను భావితరాలు గుర్తుంచుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఎంపీపీలు బండారి స్రవంతి, ఆరెల్లి దేవక్క, నాయకులు బండారి శ్రీనివాస్, కొమురయ్య, కొయ్యడ సతీశ్, బుర్ర శ్రీనివాస్, అజయ్, సతీశ్, తోడేటి తిరుపతి, బుర్ర అంజయ్య, సుద్దాల సతీశ్, బాలస్వామి, సుజాత, శ్రీకాంత్, మనోజ్, రాజ్‌కుమార్, అనిల్, సంతోష్, సమ్మయ్య పాల్గొన్నారు.

భూ తగాదాలతోనే లింగయ్య హత్య

- 24గంటల్లోనే నిందితుల అరెస్ట్
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి వెల్లడి


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: భూతగాదాలే మేకల లింగయ్య హత్యకు దారితీశాయని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి వెల్లడించారు. బుధవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 18న రాత్రి 9గంటలకు వాకింగ్‌కు వెళ్లిన మేకల లింగయ్య(48)పై నలుగురు కత్తులతో దాడిచేశారన్నారు. లింగయ్య ఖాజీపల్లిల ఉంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడ్డారని తెలిపారు. అయితే, గోదావరిఖని గంగానగర్‌లో నివాసం ఉండి ఇటీవల ఖాజీపల్లికి వచ్చిన ప్రధాన నిందితుడు మేకల కుమారస్వామి ఇల్లు నిర్మించుకున్నాడని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే రియల్ ఎస్టేట్, పాలవ్యాపారం చేస్తున్నాడన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అప్పటికే స్థిరపడ్డ మేకల లింగయ్య.. తనను వ్యాపారంలో ఎదగకుండా చేస్తున్నాడని ద్వేషం పెంచుకుని హత్య చేశాడని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని హింసా సంఘటనలకు పాల్పడితే ఊరుకునేది లేదని సీపీ హెచ్చరించారు.

పథకం ప్రకారం హత్య..

వాకింగ్ వెళ్లిన సమయాన్ని ఎంచుకుని పథకం ప్రకారమే మేకల లింగయ్య హత్య చేశారని సీపీ పేర్కొన్నారు. సమీప బంధువైన లింగయ్యను అడ్డు తొలగించుకునేందుకు డ్రైవర్ ధర్మారపు అనిల్ సహకారం తీసుకున్నట్లు తెలిపారు. అతడితోపాటు సమీప బంధువు, కమాన్‌పూర్ ప్రాంతానికి చెందిన కట్ల శంకర్, కరీంనగర్‌కు చెందిన విద్యాసాగర్ సహకారం తీసుకున్నాడన్నారు. రాత్రిపూట ఒంటరిగా వాకింగ్ వెళ్తున్న విషయాన్ని గుర్తించి, ముందే కత్తులను సేకరించారని అన్నారు. ఈక్రమంలో ఈనెల 18న తన సహచరులు అనిల్, శంకర్, విద్యాసాగర్‌ను ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్దకు రమ్మని మద్యం తాగారని అన్నారు. అక్కడ నుంచి రెండు ద్విచక్ర వాహనాలపై ఎన్టీపీసీ టౌన్‌షిప్ సమీపంలోని రింగ్ రోడ్డు పక్కన చీకట్లో ఉన్న ఒకటేలా వెనుక దాక్కొని లింగయ్య రాకకోసం కాపు కాశారన్నారు. ఎప్పటిలాగే వాకింగ్ వచ్చిన లింగయ్యపై కత్తులతో దాడి చేసి విచక్షణరహితంగా పొడిచి చంపారని అన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టారన్నారు. ఐదుగురిపై ఫిర్యాదు చేయగా వీరిలో కుమారస్వామితోపాటు నలుగురి పాత్ర ఉన్నట్లు తేలిందన్నారు.

నిందితుల అరెస్ట్

లింగయ్య హత్య కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీపీ వెల్లడించారు. ప్రధాన నిందితుడు అదే గ్రామానికి చెందిన మేకల కుమారస్వామి(43), మాతంగికాలనీకి చెందిన అతడి డ్రైవర్ ధర్మారపు అనిల్(30), కమాన్‌పూర్‌కు చెందిన నిందితుడి మేనమామ కొడుకు కట్ల శంకర్(36), కరీంనగర్ భాగ్యనగర్‌కు చెందిన అతడి మిత్రుడు కూనమల్ల స్వామిదాస్(46)ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈసంఘటనలో మిగతా నిందితుల పాత్రపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్, ఎన్టీపీసీ సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్‌ఐ జీవన్, అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్‌ను సీపీ అభినందించారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాస్, సీఐ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జ్వరంతో విద్యార్థి మృతి


సంతోష్(ఫైల్)

ముత్తారం: మైదంబండకు చెందిన ఇంటర్ విద్యార్థి ఎర్రం సంతోష్(17) తీవ్రజ్వరంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎర్రం రవి – శ్రీలత దంపతుల చిన్నకుమారుడు సంతోష్.. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించినా నయం కాలేదు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. తీవ్ర జ్వరంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు వెల్లడించారని స్థానికులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై బుధవారం ఆగిఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొని బెజ్జంకి భాస్కర్ గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ పనినిమిత్తం పెద్దపల్లికి వచ్చాడు. ఆ తర్వాత కరీంనగర్ వైపు వెళ్తుండగా ఎదురుగా ఉన్న లారీని గమనించక ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన భాస్కర్‌ను స్థానికులు వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య


పప్పు నరేశ్(ఫైల్)

రామగుండం: ఓ యువకుడు ఉరి వేసుకొని మృతిచెందిన ఘటన బుధవారం రామగుండం రైల్వే కాలనీలో చోటు చేసుకుంది. ఎస్సై బోయ వెంకట్ కథనం ప్రకారం.. రైల్వేలో విధులు నిర్వహిస్తున్న పప్పు భూదేవి కుమారుడు నరేశ్(34) కొంత కాలంగా మానసిక ఒత్తిడి, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీనికితోడు మూడేళ్ల క్రితం ఓ యువతితో పెళ్లి కుదిరినా.. అకారణంగా రద్దయింది. వీటన్నింటితోపాటు అనారోగ్య సమస్యలతో మానసిక ఒత్తిడికి గురై ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

గోదావరిఖని: స్థానిక పరుశరాంనగర్‌కు చెందిన బిజిగిరి రమేశ్(49) బుధవారం ఉరివేసుకుని మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ సుగుణాకర్ తెలిపారు. రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రమేశ్.. ఇంటిపైకప్పుకు ఉరివేసుకుని ఈఅఘాయిత్యానికి పాల్పడినట్లు వివరించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్నటున్ల వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఓదెల(పెద్దపల్లి): రూపునారాయణపేట గ్రామానికి చెందిన నీర్ల ఓదెలు(35) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఎస్సై నూతి శ్రీధర్ కథనం ప్రకారం.. ఓదెలు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, భార్యతో కుటుంబ కలహాలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం పురుగుల మందు తాగాడు. 108 అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్విజ్‌లో ప్రతిభ

జూలపల్లి(పెద్దపల్లి): 'మిల్లెట్స్ మంచి ఆహారం' అంశంపై హైదరాబాద్ ఎన్‌సీఈఆర్‌టీ కేంద్రంలో ఇటీవల నిర్వహించిన క్విజ్‌లో పెద్దాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని వర్షిణి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. విద్యార్థినికి జ్ఞాపికతోపాటు ,ప్రశంసం పత్రం అందుకున్నారు. వర్షిణిని ప్రిన్సిపాల్ పద్మశ్రీ, అధ్యాపకులు అభినందించారు.

దంపతుల మృతితో 'ఖని'లో విషాదం

ఇద్దరికీ ఒకేసారి అంత్యక్రియలు


నర్సయ్య-లక్ష్మి(ఫైల్)

గోదావరిఖని: రోడ్డుప్రమాదం రూపంలో వచ్చిన మృత్యువు ఆకుటుంబంలో విషాదం నింపింది. అనారోగ్యంతో ఉన్న అల్లుడిని చూసేందుకు కారులో వెళ్తుండగా కాటారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బొంకూరి నర్సయ్య(63), అతడి భార్య బొంకూరు లక్ష్మి(55) మృతి చెందారు. ఈసంఘటన ఖని పారిశ్రామిక ప్రాంతంలో విషాదాన్ని నింపింది. మంగళవారం రాత్రి భూపాల్‌పల్లికి కారులో వెళ్తుండగా కాటారం మండలం మేడిపల్లి అటవీప్రాంతంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడంతో నర్సయ్య తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతుడి చిన్న కుమారుడు బొంకూరు శ్రీకాంత్, మనవడు ఆశిశ్ తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతులిద్దరికీ ఒకేసారి అంత్యక్రియలు

బొంకూరి నర్సయ్య, లక్ష్మి దంపతులు 12గంటల వ్యవధిలో మృతిచెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఇద్దరికీ ఒకేసారి పోస్టుమార్టం చేసిన అనంతరం బుధవారం రాత్రి గోదావరిఖనికి తీసుకొచ్చారు. వారికి ఒకేసారి అంత్యక్రియలు పూర్తిచేశారు. మలిదశలో ప్రశాంతంగా జీవించాల్సిన దంపతులు.. రోడ్డు ప్రమాదం రూపంలో కబళించుకు వెళ్లిందని కుటుంబసభ్యులు విలపిస్తున్నారు.

'మహిళా బిల్లులో బీసీల వాటా ఎంత?'

పెద్దపల్లిరూరల్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేలా కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులో బీసీల వాటా ఎంతో స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కోరారు. బుధవారం రంగంపల్లిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని 50ఏళ్లనుంచే డిమాండ్ ఉందని, రాజీవ్‌గాంధీ1987లో మార్గరెట్ ఆల్వా అధ్యక్షతన అధ్యయన కమిటీ వేశారని గుర్తుచేశారు. మహిళలకు కనీసం 33శాతం స్థానాలు రిజర్వేషన్ అంటే.. అగ్రవర్ణాలకు స్థానాలు ధారాదత్తం చేయడమేనన్నారు. బీసీ మహిళలకు రిజర్వేషన్ లేకుండా బిల్లు ప్రవేశపెడితే అగ్రవర్ణాల ఆధిపత్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు లక్ష్మణ్, నవీన్, ఇందారపు శంకర్, సారయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠా అరెస్ట్

కోనరావుపేట(వేములవాడ): పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట పోలీసులు అరెస్టు చేశారు. చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాజలింగం వద్ద ఈనెల 6వ తేదీన 80 నాటుబాంబులు లభించాయి. రాజలింగంను అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే నాటుబాంబులను తయారు చేస్తానని, కావాల్సిన ముడిసరుకును కామారెడ్డికి చెందిన గుర్తుతెలియని మహిళ సరఫరా చేస్తుందని తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు దండి నరేశ్, నవీన్, తిరుపతి, బాలనర్సయ్య బృందంగా ఏర్పడి విచారణ చేపట్టారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డికి చెందిన మానెపల్లి చంద్రకళ(65) వద్ద 3 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకు లభించింది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులు వచ్చి సరుకులు అందిస్తారని ఆమె అంగీకరించింది. ఈనెల 19న ఎప్పటిలాగానే ముడిసరుకును అందజేయడానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన జగదీశ్ బహాటిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు కిలోల ముడిసరుకు దొరికింది. అతను సరుకును తీసుకొచ్చే బేగంబజార్‌లోని దుకాణంపై దాడి చేసి నారాయణదాస్ సార్డను, అతని అనుచరుడు విఠల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కిలోల పేలుడు పదార్థాల ముడిసరుకును స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని వివరించారు.



రామగుండంలో రయ్ రయ్..

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ మీదుగా బుధవారం వందేభారత్ రైలు నూతన కోచ్‌లతో రయ్‌మంటూ ఢిల్లీ వైపు పరుగులు పెట్టింది. ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. హైదరాబాద్ – న్యూఢిల్లీ వందే భారత్ రైలు రామగుండంలో ఆగుతుందని ఇప్పటికే ప్రకటించినా.. ఇంకా ఆగడంలేదు.

బొగ్గు బాయి

స్వచ్ఛత పక్వాడ విజయవంతం చేయాలి

– ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


మాట్లాడుతున్న చింతల శ్రీనివాస్

గోదావరిఖని: స్వచ్ఛత పక్వాడాను విజయవంతం చేయాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ కోరారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వ కోల్‌మినిస్ట్రీ ఆదేశాల మేరకు ఈనెల 16 నుంచి 30వరకు తొలిదశ, వచ్చే నెల 2నుంచి 31వరకు రెండోదశలో వివిధ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గనులు, డిపార్ట్‌మెంట్లను అందంగా తీర్చిదిద్దేలా ఆఫీసులను సర్దుకోవాలన్నారు. రెసిడెన్సియల్ కాలనీలు, ఆస్పత్రుల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, ఏజెంట్ సైదులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏజీయం లక్ష్మీనారాయణ, అధికారులు మదన్‌మోహన్, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్ క్లరికల్ విధానం సరికాదు'


వినతిపత్రం అందిస్తున్న క్లర్క్‌లు

గోదావరిఖని: హైదరాబాద్ సింగరేణి కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ద్వారా క్లరికల్ సిబ్బందిని నియమించే విధానాన్ని రద్దు చేయాలని క్లరికల్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం ఆర్జీ–1 ఏజీఎం పర్సనల్‌కు వినతి పత్రం అందజేశారు. చాలామంది నైపుణ్యం కలిగిన క్లరికల్ ఉద్యోగులు అందుబాటులో ఉండగా, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాలని నిర్ణయించడం సరికాదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.మధు, ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, సాయిరెడ్డి, అన్వేశ్, పద్మ, అనిత, మౌనిక, మాలతి, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన మానుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి: సింగరేణి యాజమాన్యం ప్రైవేటీకరణ ఆలోచనలు మానుకోవాలని ఏఐటీయూసీ ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయా డిపార్ట్‌మెంట్‌లలో టెండర్ ద్వారా 2ఏళ్ల కాలపరిమితికి ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం ఆర్జీ–3 పరిధి ఏపీఏ, ఓసీపీ–1, 2లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. సింగరేణి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపాక రాంచందర్, సమ్మయ్య, డీటీరావు, రవి, గంగాధర్, కుమార్, సుకుమర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గోదావరిఖని: సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్జీ–1 అధికార ప్రతినిధి సీహెచ్ లక్ష్మీనారాయణ బుధవారం కోరారు. గతంలో హెల్త్‌కార్డు తీసుకోనివారు, ఇప్పటివరకు ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు 2023 డిసెంబర్ 31లోపు తమ గనులు, డిపార్ట్‌మెంట్లలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. పథకం ద్వారా రూ.40వేలు చెల్లించి సభ్యత్వం తీసుకునే సదుపాయం ఉందన్నారు. దీనిద్వారా రిటైర్ ఉద్యోగి, అతడి జీవిత భాగస్వామికి కంపెనీతో ఒప్పందం చేసుకున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.8లక్షల వరకు నగదురహిత ఆరోగ్య సేవలు అందుతాయన్నారు.

ఇంటర్ ఏరియా కబడ్డీ పోటీలు ప్రారంభం



గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా ఇంటర్ ఏరియా కబడ్డీ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో జరిగిన పోటీలను ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారి సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేశ్, కో ఆర్డినేటర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేతనాలు చెల్లించాలి

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల వేతనాలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ అసంఘటిత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉడుత శంకర్ ఒక ప్రకటనలో కోరారు. వేతనాల కోసం ఇప్పటికే సింగరేణి డైరెక్టర్, జీఎంల దృష్టికి తీసుకెళ్లినా కాంట్రాక్టర్లలో మార్పురావడం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని కోరారు.

నేడు ఎక్సైజ్ ఆఫీసులో వాహనాల వేలం

పెద్దపల్లిరూరల్: బండారికుంటలోని ఎక్సైజ్ స్టేషన్‌లో గురువారం వాహనాలను బహిరంగ వేలం వేస్తామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గుడుంబాను అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడిన 8 వాహనాలను వేలం వేస్తామని వివరించారు. ఆసక్తి గలవారు గురువారం ఉదయం 10.30గంటలకు బండారికుంటలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద హాజరు కావాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం పెద్దపల్లి జిల్లా షీ- టీం సభ్యులు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినిలను వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా, మొబైల్‌కు మెసేజ్ పంపినా వెంటనే షీ-టీమ్ వాట్సప్ నంబరు 63039 23700కు సమాచారం అందించాలని సూచించారు. సైబర్‌క్రైం బారినపడ్డవారు 1930నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని అన్నారు. షీ-టీమ్ జిల్లా సభ్యులు ఏఎస్సై మల్లారెడ్డి, పోలీస్ సిబ్బంది, సురేశ్, స్నేహమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నాటిక ప్రదర్శన

పెద్దపల్లిరూరల్: ధర్మారం మండలం నందిమేడారం టీఎస్‌ఆర్‌జేసీ బాలుర కళాశాలలో గురువారం ×సంఘం శరణం గచ్ఛామి₹ నాటిక ప్రదర్శించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ బుధవారం తెలిపారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆయన లక్ష్యాలపై నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 99 ప్రాంతాల్లో ఈ నాటిక ప్రదర్శించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో మన జిల్లాలోని ధర్మారం, పెద్దపల్లి, మంథని మండలాలు ఉన్నాయని వివరించారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సిమ్స్, జీజీహెచ్ ఉచిత వైద్య శిబిరాలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ బుధవారం తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మేళాలో భాగంగా ఈనెల 22న సుల్తానాబాద్ సీహెచ్‌సీ, 29న మంథనిలో వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, గైనకాలజిస్ట్, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఆప్తమాలజీ తదితర విభాగాల స్పెషలిస్టులు సేవలందిస్తారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగా గురువుకు జాతీయ అవార్డు


అవార్డుపత్రం అందుకుంటున్న సుధాకర్

ధర్మారం: యోగా గురువు జంగిలి సుధాకర్ జాతీయ స్థాయిలో బెస్టు యోగా గురువు అవార్డుకు ఎంపికయ్యారు. సాహిత్య అకాడమీ సంస్థ ఆయనను ఈ అవార్డుకు ఎంపికచేసింది. హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అవార్డు పత్రాన్ని సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అందించారు. అక్టోబర్ 15న న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్ వేదికపై సుధాకర్‌కు అవార్డు అందిస్తామని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, బాదే వెంకటేశ్వర్ తెలిపారు. ఖిలావనపర్తికి చెందిన సుధాకర్ 2019 నుంచి ధర్మారంలో ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నారు. కోవిడ్ సమయంలోనూ పలువురికి యోగా శిక్షణ ఇచ్చి ఆరోగ్యంపై భరోసా కల్పించారు.

అప్రమత్తంగా ఉండాలి



గోదావరిఖని: డయల్ 100సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు బ్లూకోల్ట్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ తుల శ్రీనివాస్ సూచించారు. బుధవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. క్రైం ప్రీవెన్షన్‌లో బ్లూకోల్ట్స్ పాత్ర, రౌడీషీటర్స్, క్రిమినల్స్‌పై నిఘా ఉంచడం, రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరించే వారి వివరాలు సేకరించడం, గణేశ్ మండపాలను సందర్శించాలని సూచించారు. మత కలహాలు కలిగించే ఆకతాయిలపై నిఘా ఉంచడం, యాంటీ డిసెక్రేషన్ డ్రిల్ అంశాలపై అవగాహన కల్పించారు. వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, రెండో సీఐ ప్రసాద్‌రావు, ఎస్‌ఐలు సమ్మయ్య, సుగుణకర్, శరణ్య, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు గండి



రామగుండం: బ్రాహ్మణపల్లి జంక్షన్ 27ఎల్ వద్ద ఎస్సారెస్పీ కాలువ లైనింగ్‌కు రెండు వైపులా గండి పడింది. రైతులు ఒకవైపు ప్లాస్టిక్ కవర్ కట్టి లీకేజీ నీరు వృథా కాకుండా అరికట్టారు. కానీ, రెండోవైపు నుంచి నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని ఎస్సారెస్పీ అధికారులకు 15రోజుల క్రితం చెప్పినా పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. దీంతో ముర్మూర్, గోలివాడ, ఎల్లంపల్లి గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి అవసరం లేకున్నా.. ఆ తర్వాతనైనా అధికారులు స్పందించి గండ్లు పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

మట్టిగణేశునితో సెల్ఫీ

సాక్షి, పెద్దపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అనేకమంది తమ ఇళ్లలో మట్టి వినాయక ప్రతిమలు ఏర్పాటుచేశారు. పర్యావరణ పరిరక్షణతోపాటు భక్తితో భగవంతున్ని కొలుస్తున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించేలా 'సాక్షి' సెల్ఫీవిత్ గణేశ పేరిట ఇలా ఫొటోలో ప్రచురిస్తోంది.


ప్రాంతం: ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పెద్దపల్లి
ప్రత్యేకత: ఆరు ఏళ్లుగా ఏటా 47 ఫీట్ల మట్టి గణపతి విగ్రహంతో ఛత్రపతి యూత్ సభ్యుల వేడుకల నిర్వహణ
పేర్లు : శివంగారి రాజేశ్, అభి, నరేశ్, విక్కీ, శశి


ప్రాంతం: అన్నపూర్ణమ్మకాలనీ, గోదావరిఖని
ప్రత్యేకత: కొన్నేళ్లుగా మట్టి గణపయ్యకే పూజలు
పేరు: గోలివాడ సరిత


ప్రాంతం: బస్‌స్టాండ్ వద్ద, పెద్దపల్లి
ప్రత్యేకత: ఇంట్లో మట్టి గణపయ్యకే పూజలు
పేరు: హర్షిత, సాయిమేధ


ప్రాంతం: హనుమాన్ నగర్, పెద్దపల్లి
ప్రత్యేకత: గత కొన్నేళ్లుగా ఇంట్లో మట్టి గణపతితోనే వినాయక నవరాత్రి వేడుకలు
పేరు:అనూష